# పెద్ద ఉద్యోగాల భర్తీకి తొలి ప్రాధాన్యం

ఈనాడు - హైదరాబాద్

ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యక్రమాన్ని అనుసరించాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. పోస్టులు ఖాళీగా ఉండకుండా నివారించడం, అభ్యర్థులకు మేలు కలిగించడం లక్ష్యాలుగా ఈ నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగాల భర్తీ ప్రకటనలో పేర్కొన్న అన్ని రకాల పోస్టులకు దరఖాస్తు చేయడం, ఒకటికన్నా ఎక్కువ పోస్టులకు ఎంపికయితే మంచిదాన్ని ఎంచుకోవడం సాధారణంగా జరిగేదే. ఈ క్రమంలో ముందుగా చిన్న ఉద్యోగాల్లో చేరిన వారు, తరువాత పెద్ద ఉద్యోగాలు వచ్చిన వెంటనే వాటిల్లో చేరిపోతున్నారు. ఇలా వీరు వదిలివెళ్లిన ఉద్యోగాలను మరో నోటిఫికేషన్ ద్వారా కానీ భర్తీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో కింది వరుసలో ఉన్న వారు ఉద్యోగావకాశాల్ని కోల్పోతున్నారు. చాలా రకాల ఉద్యోగాలకు ఏకకాలంలో ప్రకటనలు ఇచ్చిన సమయంలో ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఉద్యోగాల భర్తీ జరిగినట్లయితే ఈ ఇబ్బంది తలెత్తదు. కానీ ప్రభుత్వ నిర్ణయాలు అనుసరించి ఉద్యోగాల ప్రకటనలు వెలువడుతుండడంతో సమస్యలు వస్తున్నాయి.

గ్రూపు-1, 2, 3, 4, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పోస్టులు, ఇతర ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్లు రాబోతున్నాయి. గతంలో మాదిరిగా నియామకాలను చేపడితే మూడు, నాలుగు పోస్టులకు ఎంపికయ్యే వారు పెద్ద ఉద్యోగాన్నే ఎంచుకుంటారు. మళ్లీ ఉద్యోగాలు మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయి. ఏపీపీఎస్సీ నియమావళి రూల్ నెంబరు 6 అనుసరించి ఖాళీ అయ్యే ఉద్యోగాల్ని ఆ తరువాత జారీచేసే నోటిఫికేషన్లో చేర్చుతారు. రూల్-7 అనుసరించి వెయిటింగ్ లిస్టులో ప్రాధాన్యక్రమంలో ఉన్న వారితో ఉద్యోగాల్ని భర్తీచేయాలని ఉన్నా ఆచరణలో అనేక సమస్యలు ఉన్నాయని ఏపీపీఎస్సీవర్గాలు పేర్కొంటున్నాయి. అందువల్లే సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి ప్రస్తుతానికి ఓ నోటిఫికేషన్ విషయంలో రూల్-7ను అమలు చేసి, తరువాత దాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని కోరాయి.

## సమస్యకు పరిష్కారం ఇలా...

ఈ సమస్యకు పరిష్కారం లభించేలా ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. 'గతంలో మాదిరిగా చేయం. నోటిఫికేషన్లు, రాత పరీక్షలు ఇంచుమించు ఒకే సమయంలో జరిగినా ఫలితాల్ని మాత్రం తగిన సమయంలోనే వెల్లడిస్తాం. పెద్ద ఉద్యోగాల నియామకాల్ని చేపట్టిన తర్వాతనే ప్రాధాన్య క్రమంలో ఇతర ఉద్యోగాల భర్తీని చేపడతామని' ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అందులో భాగంగా తొలుత గ్రూపు-1 పరీక్షలు నిర్వహించనున్నారు. ఆ తర్వాతనే గ్రూపు-2, 3 ఉద్యోగాల భర్తీని చేపట్టనున్నారు. ఇలా వచ్చే ఏడాది జూన్ వరకు పరీక్షలు జరిపేలా కార్యాచరణ రూపొందించాల్సి వస్తోందని భావిస్తున్నారు. గ్రూపు-2 పరీక్షకు కూడా ప్రిలిమ్స్, మెయిన్స్ నిర్వహించడానికే ఏపీపీఎస్సీ కట్టుబడి ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే తొలుత ఇంజినీరింగ్ ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువడే అవకాశం ఉంది.